‘ఉపాధి’తో వ్యవసాయ కూలీలకు ఊరట

- రూ.16.99 కోట్లతో చేపట్టిన వివిధ రకాల అభివృద్ధి పనులు
- ఇప్పటి వరకు రూ.2.91కోట్ల పనులు పూర్తి
- మరింత వేగంగా పనులు చేపట్టేలా అధికారుల చర్యలు


హిమ్మత్‌నగర్‌లో పూడికతీత పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)


ఓబులాపూర్‌లో ఉపాధి పనులు చేస్తున్న ఉపాధి కూలీలు (ఫైల్)

జఫర్‌గఢ్: వ్యవసాయ కూలీలకు ఉపాధినివ్వడంతో పాటు నీటి వనరుల అభివృద్ధి, పర్యావరణాన్ని కాపాడేందుకు గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా వివిధ రకాల అభివృద్ధి పనులను చేపట్టారు. మండలంలో ప్రస్తుతం వ్యవసాయ పనులు పూర్తిగా నిలిచిపోవడంతో వ్యవసాయ కూలీలకు పనులు దొరకక ఇబ్బందులు పడుతున్న తరుణంలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులు వారికి ఎంతో ఊరటనిస్తున్నాయి. ప్రత్యేకించి కూలీలకు ఉపాధినివ్వడంతో పాటు గ్రామాలు, రైతుల అభివృద్ధికి ఈ పథకం ఎంతో దోహదపడుతోంది. 2024–25 సంవత్సరానికి గాను మండలానికి ఉపాధి హామీ పథకం ద్వారా వంద రోజుల పనిదినాలకు ప్రభుత్వం రూ.16.99కోట్ల బడ్జెట్‌ను కేటాయించింది. ఇట్టి నిధుల ద్వారా వివిధ రకాల అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రభుత్వం ముందుకు రావడంతో పాటు గ్రామ పంచాయతీల తీర్మానం ఆధారంగా పనులు చేపట్టారు. ఇందులో 10 రకాల అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉండగా సహజ వనరుల అభివృద్ధికి సంబంధించిన నీటి నిల్వల పనులు, పంట కాల్వలు, కుంటల నిర్మాణం, చెరువుల పూడికతీత, చేపల కందకాలు, గుంతల నిర్మాణం, పంట పొలాల వద్ద ఫీడర్‌చానల్ నిర్మాణం, మట్టి రోడ్ల నిర్మాణం తదితర పనులను చేపట్టారు. ఈ పనులు పూర్తి స్థాయిలో కూలీల ద్వారా చేపడుతున్నారు. అయా గ్రామాల్లో ఉపాధి పథకం ద్వారా కూలీలతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టడంతో ఇప్పటి వరకు కూలీలు 27 శాతం పనిదినాలను పూర్తి చేశారు. మిగితా పని దినాలను కూడా పూర్తి చేసేందుకు సంబంధిత అధికారులు కసరత్తు చేస్తున్నారు. మొత్తం 9,648 జాబ్ కార్డులకు 6,002 జాబ్ కార్డులు కలిగిఉన్న కుటుంబాలకు పని కల్పించారు. ఇందుకు రూ.2.91కోట్ల ఖర్చు చేసినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. మిగితా డబ్బును కూలీలకు ఖర్చు చేసేందుకు ప్రణాళికలు రూపొందించారు. కాగా, ఉపాధి పథకం ద్వారా చేపట్టిన పలు అభివృద్ధి పనుల మూలంగా ఒక వైపు కూలీలకు ఉపాధి లభించడంతో పాటు నీటి వనరుల అభివృద్ధికి ఎంతో ఉపయోగపడుతోంది. పైగా ఎన్నో ఏళ్ల నుంచి రహదారి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్న రైతులకు సైతం పంట పొలాల మీదుగా రోడ్డు సౌకర్యం లభిస్తోంది. ప్రస్తుతం చేపట్టిన పనులు గట్టి నేల కావడం, ఎండల దృష్ట్యా ఎక్కువగా పని చేయలేకపోతున్నట్లు కూలీలు వాపోతున్నారు. చేసిన పనికి కూలి గిట్టుబాటు కావడం లేదంటున్నారు. ఇంకా ఎక్కువ రోజుల పనిదినాలు కల్పించాల్సి ఉండడంతో మరింత ఎక్కువ మంది కూలీలకు ఉపాధి కల్పించేలా అధికారులు కృషి చేయాల్సి ఉంది.

ఎక్కువ మందికి పని దినాలు కల్పిస్తున్నాం..

ఉపాధి హామీ పథకం ద్వారా ఎక్కువ మంది కూలీలకు ఉపాధి పనులు కల్పిస్తున్నాం. మొత్తం 9,648 జాబ్ కార్డులకు 6,002 కుటుంబాలకు పనులు కల్పిస్తున్నాం. ఇందులో 9,894 మంది కూలీలు ఉపాధి పొందుతున్నారు. ఉపాధి పని కోసం కూలీలు ఎవరైన ఉంటే గ్రామ పంచాయతీ కార్యదర్శి ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

- రాజకరుణ, ఏపీఓ

సకాలంలో డబ్బులు చెల్లించాలి



సకాలంలో కూలి డబ్బులు రావడం లేదు. ప్రస్తుతం ఎండలు దంచికొడుతుడం, మరోవైపు గట్టి నేలలు కావడం వల్ల పనులు చేసేందుకు కూలీలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ప్రతి రోజు రూ. 300 కూలి చెల్లిస్తామని ప్రభుత్వం చేప్తున్నా రోజుకు రూ.150 నుంచి రూ.175 మాత్రమే వస్తుంది. కూలి డబ్బులు పెంచడంతో పాటు సకాలంలో డబ్బులు చెల్లించేలా అధికారులు చూడాలి.

- బల్లెపు రవి, ఉపాధి కూలీ

బాలుడిని బతికించరూ..

- లివర్ వ్యాధితో ఒకసారి ఆపరేషన్..
- మరో ఆపరేషన్‌కు రూ.6 లక్షలు కావాలి
- దాతల సాయం కోసం ఎదురుచూపు


మొదటి ఆపరేషన్ తర్వాత బాలుడితో తల్లిదండ్రులు

పాలకుర్తి: మండల కేంద్రానికి చెందిన వనాల ధనుంజయ్–లలిత దంపతుల కుమారుడు శ్రీవర్ధన్(9) లివర్ వ్యాధితో బాధపడుతున్నాడు. ఇప్పటికే ఒకసారి ఆపరేషన్ చేశారు. వ్యాధి నయం కాకపోవడంతో మరోసారి ఆపరేషన్ చేయాలని వైద్యులు చెప్పారు. ఇందుకు సుమారు రూ.6 లక్షలు అవుతుందని తెలిపారు. ఆ కుటుంబానికి అంతటి ఆర్థిక స్తోమత లేక పోవడంతో దాతల సాయం కోసం ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే మొదటి ఆపరేషన్, మందులకు అప్పు చేశామని, చేతిలో చిల్లి గవ్వ లేదని బాలుడి తల్లిండ్రులు వాపోయారు. దాతలు ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

ఆర్థికసాయం చేయాలనుకున్న వారు వన్నాల ధనుంజయ్, ఫోన్ పే, గూగులే పే నంబర్ 99128 40348కు పంపించాలని వారు కోరారు.

క్లుప్తంగా

నేటి నుంచి ‘ఎమ్మెల్సీ’ ఓటరు స్లిప్పుల పంపిణీ



బచ్చన్నపేట: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ఓటరు స్లిప్పులను నేటి(శుక్రవారం) నుంచి పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ విశాలాక్షి తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాయంలో విలేకరులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మండలంలో 1,275 పురుష, 719 మహిళా పట్టభద్రుల ఓట్లు ఉన్నాయని అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో పోలింగ్ స్టేషన్–8లో 661 పురుషులు, 363 మహిళా ఓటర్లు, అదే పాఠశాలలోని పోలింగ్ స్టేషన్–9లో పురుషులు 614మంది, మహిళలు 356, ట్రాన్స్‌జెండర్–1 ఓటు వేయాలని అన్నారు. ఈ నెల 27వ తేదీన పట్టభద్రుల వరంగల్–ఖమ్మం–నల్లగొండ ఎమ్మెల్సీ ఎన్నిక ఉన్నందున ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని తహసీల్దార్ కోరారు. డిప్యూటీ తహసీల్దార్ ఖాసీం, ఎంఆర్ఐ శ్రీనివాస్‌రావు, జూనియర్ అసిస్టెంట్ యాకయ్య తదితరులు ఉన్నారు.

‘అరూరి’ గెలుపొందాలని తిరుపతిలో పూజలు



చిల్పూరు: బీజేపీ వరంగల్ ఎంపీ అభ్యర్థి ఆరూరి రమేశ్ గెలుపొందాలని మండలంలోని ఫత్తేపూర్ గ్రామానికి చెందిన ఆ పార్టీ ఎస్టీ సెల్ నాయకుడు గుగులోత్ మధు గురువారం తిరుపతిలో మెట్ల మార్గంలో వెళ్లి ప్రత్యేక పూజలు చేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో నూ బీజేపీ అధికారంలోకి రావాలని కోరుతూ తల నీలాలు సమర్పించనున్నట్లు తెలిపాడు.

ఎమ్మెల్సీ ఎన్నికలో ఆదరించాలి

బచ్చన్నపేట: వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని ఆదరించి గెలిపించాలని ఆ పార్టీ జిల్లా నాయకుడు జంగిటి విద్యానాథ్ కోరారు. గురువారం మండలంలోని పడమటికేశ్వాపూర్ గ్రామంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో విసిగి వేసారిన ప్రజలు అసెంబ్లీ ఎన్నికల్లో మార్పును కోరుకున్నారని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కూడా పలు పార్టీల కల్లబొల్లి మాటలను నమ్మకుండా అధికార పార్టీకే ఎక్కువ ఓట్లు వేశారని తెలిపారు. ఈ నెల 27వ తేదీన జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు పట్టం కట్టాలని కోరారు. గ్రామ శాఖ అధ్యక్షుడు చల్ల సంతోష్‌రెడ్డి, కార్యదర్శి ఎర్రోళ్ల నర్సింహయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

జనగామ రూరల్: మండలంలోని పెంబర్తి–అలేరు రైల్వే స్టేషన్ల మధ్య గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం చోటు చేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. 25 నుంచి 30 ఏళ్ల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి రైలు ఢీకొనడంతో మృతి చెంది ఉండవచ్చని తెలిపారు. తెల్లని చొక్కా బ్లూ జీన్స్ ధరించి ఉన్నాడని చెప్పారు.

విద్యుదాఘాతంతో పాడి ఆవు..



స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ డివిజన్ కేంద్రానికి చెందిన గాదె పెద్దులుకు చెందిన పాడి ఆవు విద్యుదాఘాతంతో మృతి చెందిన సంఘటన బుధవారం రాత్రి జరిగింది. బాధితరైతు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఘన్‌పూర్‌లో సైదవారి కుంట వైపు రావుల గడ్డ ఏరియాలో పెద్దులు తమ వ్యవసాయ కొట్టం వద్ద రోజూ మాదిరిగానే పాడి ఆవును కట్టేశాడు. సాయంత్రం వీచిన ఈదురుగాలులతో విద్యుత్ వైరు తెగిపడగా విద్యుదాఘాతంతో ఆవు అక్కడికక్కడే మృతిచెందింది. కాగా, గురువారం ఉదయం వ్యవసాయం కొట్టం వద్దకు వెళ్లిన రైతు పెద్దులు ఆవు మృతి చెంది ఉండటం చూ సి రోదించాడు. విద్యుదాఘాతంతో ఆవు మృతి చెందిందని వాపోయాడు. ఈ ప్రమాదంతో రూ.60వేల నష్టం వాటిల్లిందని, సంబంధిత అధికారులు, ప్రభుత్వం స్పందించి ఆర్థికంగా ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.

ఆర్థికసాయం



జఫర్‌గఢ్: తిమ్మంపేట గ్రామానికి చెందిన కుంబోజు మహేష్ కుమారుడు మాధవన్ గౌచర్ అనారోగ్యంతో బాడుతున్నాడు. కాగా గ్రామానికి చెందిన ఉపాధి కూలీలు వైద్యం కోసం రూ.2 వేల సాయం గురువారం అందజేశారు. ఫీల్డ్ అసిస్టెంట్ తూల్ల కుమార్, మంద రాజు, మల్లం అరుణ, నూకల సమ్మక్క, పులిగిల్ల నాగమ్మ, పెండ్లి కోమలత, కోట సరోజన, మల్లం యాదమ్మ ఉన్నారు.

హామీలు అమలు చేయాలని రాస్తారోకో


రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

పాలకుర్తి టౌన్: పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన వెంటనే రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, జెడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాసరావు, రాష్ట్ర ఎస్టీ అభివృద్ధి సంఘం మాజీ చైర్మన్లు అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నిక అనంతరం ధాన్యం క్వింటాకు రూ.500 అదనంగా అందిస్తామని ప్రకటించి నేడు సన్న రకం ధాన్యానికి మాత్రమే అందిస్తామనడం సరైంది కాదన్నారు. 90 శాతం మంది రైతులు దొడ్డు రకం ధాన్యాన్నే పండిస్తారని తెలిపారు. ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతులు దోపిడీకి గురవుతున్నారని అన్నారు. రాస్తారోకోలో నియోజకవర్గంలోని ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

డెంగీ నివారణపై అవగాహన ర్యాలీ


దేవరుప్పులలో ర్యాలీ తీస్తున్న వైద్య సిబ్బంది


పాలకుర్తిలో..

దేవరుప్పుల: జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వర్షాకాలంలో అపరిశుభ్రత వల్ల దోమల వ్యాప్తి చెందకుండా ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వెంకటలక్ష్మి, హెచ్‌వీ సంపూర్ణ, పీహెచ్‌సీ సూపర్‌వైజర్ రామకృష్ణ, ఎల్‌టీ రామకృష్ణ, ఏఎన్ఎంలు దేవంద్ర, సరిత, ఆశ వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

డెంగీపై అవగాహన కలిగి ఉండాలి

పాలకుర్తి టౌన్: డెంగీ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రవి అన్నారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం పాలకుర్తిలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ గ్రామాల్లో దోమలు వ్యాప్తి చెందకుండా చూసుకోవాలన్నారు. డాక్టర్ ఉషారాణి, లిల్లీ దెబోరా, శ్రీనివాస్ రెడ్డి, వేణుకుమార్, ఎలేందర్, వనజ, స్వాతి మంగమ్మ, శోభ, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

జూన్ 6 వరకు ఎన్నికల కోడ్ అమలు


మాట్లాడుతున్న ఆర్డీఓ డీఎస్ వెంకన్న

స్టేషన్‌ఘన్‌పూర్: ఈనెల 27న వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు ఉన్నాయని, జూన్ 6వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీఓ డీఎస్ వెంకన్న అన్నారు. ఘన్‌పూర్‌లోని ఆర్డీఓ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందుగా ఇటీవల ముగిసిన పార్లమెంట్ ఎన్నికల్లో ఘన్‌పూర్ నియోజకవర్గంలో పోలింగ్ ప్రశాంతంగా, సజావుగా జరిగేలా కృషి చేసిన ఉద్యోగులు, ఎన్నికల అధికారులు, సిబ్బందికి, సహకరించిన మీడియాకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికలు ముగిసినప్పటికీ జూన్ 4న ఫలితాలు వెలువడుతాయని, అదే విధంగా ఈనెల 27న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు ఉన్నందుక ఎన్నికల కోడ్ జూన్ 6 వరకు ఉంటుందన్నారు. ఘన్‌పూర్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని స్టేషన్‌ఘన్‌పూర్, చిల్పూరు, జఫర్‌గఢ్, పాలకుర్తి, కొడకండ్ల మండలాల పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు ఆర్ఓగా నల్గొండ జిల్లా కలెక్టర్ ఉంటారని, ఏఆర్ఓలుగా ఆయా జిల్లాలోని ఆర్డీఓలు వ్యవహరిస్తారని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించేందుకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని, ఘన్‌పూర్ రెవెన్యూ డివిజన్ పరిధిలో ఆర్డీఓ ద్వారా అనుమతులు తీసుకోవాల్సి ఉంటుందన్నారు.

ఘన్‌పూర్ డివిజన్‌లో 8,483 ఓట్లు

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు గాను ఘన్‌పూర్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఐదు మండలాలకు గాను 8483 ఓట్లు ఉన్నాయని ఆయన తెలిపారు. ఇందులో స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలో 2027, చిల్పూరు 1144, జఫర్‌గడ్ 1512, పాలకర్తి 2495, కొడకండ్ల 1305 మంది ఓటర్లున్నారన్నారు. ఈ ఎన్నికలకు గాను ఆయా మండల కేంద్రాల్లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తారని, మొత్తం ఐదు మండలాలకు గాను పది పోలింగ్ కేంద్రాలుంటాయన్నారు. అందులో స్టేషన్‌ఘన్‌పూర్‌లో 3, పాలకుర్తిలో 3, జఫర్‌గడ్ 2, చిల్పూరు 1, కొడకండ్లలో 1 ఉంటాయన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు 52 మంది అభ్యర్థులున్నారని, బ్యాలెట్ పేపర్ పద్ధతిలో ఓటింగ్ ఉంటుందన్నారు. ఎన్నికల కోడ్, 144 సెక్షన్ అములులో ఉన్నందున ప్రతీ ఒక్కరూ తప్పనిసరిగా నిబంధనల్ని పాటించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో డీటీ విజయ్‌కుమార్, ఆర్ఐలు అర్జున్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

జఫర్‌గఢ్: నల్లగొండ, ఖమ్మం, వరంగల్ నియోజక వర్గ శాసనమండలి పట్టభద్రుల స్థానానికి ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీఓ డీఎస్ వెంకన్న గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో పట్టభద్రుల ఓటర్లు 1,512 మంది ఉన్నారని, జఫర్‌గఢ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రెండు పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తహసీల్దార్ ఆంజనేయులు పాల్గొన్నారు.

కొడకండ్లలో..

కొడకండ్ల: మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేయనున్న ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాన్ని స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీఓ వెంకన్న గురువారం పరిశీలించారు. ఏర్పాట్లపై రెవెన్యూ అధికారులకు ఆయన సూచనలివ్వడంతో పాటు ధరణికి సంబంధించిన పెండింగ్ దరఖాస్తులను క్లియర్ చేయాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ అంజయ్య, ఆర్ఐ శ్రీనివాస్, బీఎల్వో సూపర్ వైజరు గొడుగు అనిల్, సోనీతోపాటు తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు చేపట్టాలి

స్టేషన్‌ఘన్‌పూర్: ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు రాష్ట్ర ప్రభుత్వం సత్వరమే చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు మంగు జయప్రకాష్ డిమాండ్ చేశారు. ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికలు ముగిసినందున ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులపై దృష్టి సారించాలని, గత ఏడాది ఫిబ్రవరిలో మొదలైన ఉపాధ్యాయుల పదోన్నతులను పునఃప్రారంభించాలన్నారు. ముందుగా మల్టీజోన్ 2 లోని 13 జిల్లాల పంచాయతీ రాజ్ ఉపాధ్యాయుల జీహెచ్ఎం పదోన్నతులను తక్షణమే చేపట్టాలన్నారు. మల్టీజోన్ 2లోని పీఆర్ ఉపాధ్యాయుల జీహెచ్ఎం పదోన్నతులు వెంటనే చేపడితే ఆ జోన్‌లో 1000 పాఠశాలల్లో హెచ్ఎం పోస్టుల భర్తీ అయి వచ్చే 2024–25 విద్యాసంవత్సరానికి బోధన, పర్యవేక్షణ సజావుగా సాగే అవకాశం ఉంటుందన్నారు. జూన్ 4న పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు వచ్చే లోపుగానే ఎన్నికల కమిషన్ అనుమతి తీసుకుని ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు చేపడితే వచ్చే విద్యాసంవత్సరం పాఠశాల పనిదినాలు వృథాకాకుండా ఉంటాయని, ఈ దిశగా రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని ఆయన కోరారు.

వలస కూలీ మృతి


మృతుడు అజయ్‌శ్రీవాస్

రఘునాథపల్లి: స్నానం చేస్తూ ప్రమాదవశాత్తు కింద పడి ఓ వలస కూలీ మృతి చెందిన సంఘటన మండలంలోని ఖిలాషాపూర్‌లో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు కథనం ప్రకారం.. మధ్యప్రదేశ్ రాష్ట్రం బాలాఘాట్ జిల్లా గిర్హా మండలం, రాగలి గ్రామానికి చెందిన అజయ్‌శ్రీవాస్ (21) అనే యువకుడు మూడు నెలల క్రితం హైదరాబాద్‌కు వలస వెళ్లి కూలీ పనులు చేస్తుండేవాడు. అక్కడ పనులు దొరకక పోవడంతో మండలంలోని ఖిలాషాపూర్‌లోని స్నేహితుడికి ఫోన్ చేసి పని చూపాలని కోరాడు. తన వద్దకు వస్తే పని చూపుతానని చెప్పడంతో మూడు రోజుల క్రితం ఖిలాషాపూర్ చేరుకొని స్నేహితుడి వద్ద ఉంటున్నాడు. గ్రామంలోని కాగితాల ఉప్పలయ్య వద్ద బుధవారం కూలీ పనులు చేశాడు. సాయంత్రం అజయ్‌శ్రీవాస్ స్నానం చేస్తుండగా జారి కింద పడటంతో తల వెనుకభాగాన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. గురువారం జనగామ ఏరియా ఆస్పత్రిలోని మార్చురిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి మధ్యప్రదేశ్ నుంచి వచ్చిన కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి తండ్రి శివకుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో పెంకుటిల్లు దగ్ధం


పెంకుటిల్లు దగ్ధం కావడంతో నిరాశ్రయులైన కుటుంబం

రఘునాథపల్లి: షార్ట్ సర్క్యూట్‌తో ఓ పెంకుటింట్లో మంటలు చెలరేగి రూ.లక్షకు పైగా విలువైన వస్తువులు, నగదు దగ్ధమైన సంఘటన మండలంలోని కంచనపల్లిలో గురువారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన జీగిరి నర్సయ్య–అండాలు దంపతులు పెంకుటింట్లో నివాసముంటున్నారు. ఉదయాన్నే అండాలు గ్రామశివారులో జాతీయ ఉపాధి పనులకు వెళ్లగా, భర్త నర్సయ్య వ్యవసాయ పనులకు వెళ్లారు. ఇంటికి తాళం వేసి వెళ్లిన కొద్ది సేపటికే ఇంట్లో షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు వ్యాప్తి చెందాయి. స్థానికులు గుర్తించి నర్సయ్యకు సమాచారమిచ్చారు. పరుగున ఇంటికి చేరుకొని స్థానికులతో కలిసి ఎగిసిపడుతున్న మంటలపై బిందెలతో నీళ్ల చల్లారు. మంటలు చుట్టూ వ్యాపించంగా నర్సయ్య ఇంట్లోని సిలిండర్‌ను బయటకు తేవడంతో ప్రమాదం తప్పింది. మంటలు అదుపులోకి రాకపోవడంతో స్థానికుల సమాచారంతో ఫైరింజన్ చేరుకొని మంటలు ఆర్పారు. అప్పటికే ఇంట్లో ఉన్న బీరువాలోని రూ.48 వేల నగదు, బట్టలు, టీవీ, ఇంటి సామాగ్రి మంటలకు దగ్ధమయ్యాయి. సంఘటనతో రూ లక్షకు పైగా అస్తి నష్టం జరిగినట్లు బాధితులు వాపోయారు. నిరుపేద కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరారు.

జనగామకు తరలిన పట్టభద్రులు

బచ్చన్నపేట: జనగామ మండలం పసరమడ్ల గ్రామ ఉషోదయ ఫంక్షన్‌హాల్‌లో గురువారం నిర్వహించిన పట్టభద్రుల సమావేశానికి మండలం నుంచి ప్రజాప్రతినిధులు, పట్టభద్రులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి జనగామ ఎమ్మెల్యేగా గెలుపొందడంతో ఆ స్థానం ఖాళీ అయినది. ఈ నేపథ్యంలో ఉప ఎన్నిక సందర్భంగా నిర్వహిస్తున్న సమావేశానికి నాయకులు తరలివెళ్లారు. రైతుబంధు సమితి జిల్లా మాజీ కోఆర్డినేటర్ ఇర్రి రమణారెడ్డి, మండల అధ్యక్షుడు బొడిగం చెంద్రారెడ్డి, ఎంపీపీ బావండ్ల నాగజ్యోతి, వైస్ ఎంపీపీ కల్లూరి అనిల్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ పులిగిల్ల పూర్ణచందర్, వైస్ చైర్మన్ రాధ, నాయకులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ


నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కొడకండ్ల: మండలకేంద్రానికి చెందిన సీనియర్ నాయకుడు జక్కుల ఎల్లయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, గురువారం మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు సిందె రామోజీ నాయకులతో కలిసి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. ఎల్లయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సోమరాములు, సతీష్‌గౌడ్, వెంకటనారాయణ, హరీష్, షన్నా, రమేష్ ఉన్నారు.

ఆర్థికసాయం

దేవరుప్పుల: మండలంలోని మాధాపురంలో ఇటీవల మృతి చెందిన రూపాని జానమ్మ కుటుంబానికి బీఆర్ఎస్ నాయకులు ఆర్థికసాయం అందించి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ బాధిత కుటుంబ సభ్యులకు అన్ని విధాలుగా తోడ్పాటు అందిస్తుందన్నారు. ఎల్లయ్య, రాజు, భూసామి, నాగరాజు, క్రాంతి, సోమయ్య, రాములు, రవి, రవీందర్ ఉన్నారు.

సీఎంతో సోషల్ మీడియా బృందం

దేవరుప్పుల: కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం విస్తృతంగా పనిచేసిన సోషల్ మీడియా వారియర్ బృందాన్ని కలిసేందుకు గురువారం హైదరాబాద్‌లో మీట్‌ది సీఎం రేవంత్‌రెడ్డి పేరిట ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా జిల్లా నుంచి యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా జిల్లా కోఆర్డినేటర్లు మాసంపెల్లి సాత్విక్‌పటేల్ (కడవెండి), జోగు అనిల్ (సింగరాజుపల్లి), దేవరుప్పుల మండల కోఆర్డినేటర్లు గనుపాక ప్రదీప్(కోలుకొండ), దాసగాని రాజు (రామరాజుపల్లి), పాలకుర్తి నియోజకవర్గ కో కన్వీనర్ కొండ శ్రీను (పాలకుర్తి) తదితరులు కలిశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి పార్టీ కోసం అంకితభావంతో పనిచేసే యువతకు భవిష్యత్‌లో తగిన గుర్తింపు అనివార్యంగా లభిస్తుందని సూచించినట్లు సాత్విక్ పటేల్ తెలిపారు.

వాటర్ ప్లాంట్ తెరిచేదెప్పుడో..?


మూతపడిన వాటర్ ప్లాంట్

చిల్పూరు: మండలంలోని కృష్ణాజీగూడెం గ్రామంలో జీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మినరల్ వాటర్ ప్లాంట్ మూత పడి రెండు నెలలవుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని, ప్లాంట్ తెలిచేదెప్పుడని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను రెండుసంవత్సరాలకు ఒకసారి లీజుకు ఇస్తారు. లీజు ముగియడంతో ప్లాంట్ మూసివేశారు. వెంటనే మరొకరితో ప్లాంట్ నిర్వహించాలని కోరినా పంచాయతీ కార్యదర్శి రెండు నెలలుగా పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. మినరల్ వాటర్ ను చుట్టు పక్కల ఉన్న తాటికొండ, పల్లగుట్ట, చిల్పూరు గ్రామాలకు వెళ్లి తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొందని అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాటర్ ప్లాంట్‌ను తెరిపించాలని ప్రజలు కోరుతున్నారు.

కడియంను కలిసిన కాంగ్రెస్ నాయకులు



చిల్పూరు: మండలంలోని పలుగ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు గురువారం హనుమకొండలోని కడియం నివాసంలో ఎమ్మెల్యే శ్రీహరిని మర్యాదపూర్వకంగా కలిశారు. కాగా, ఎమ్మెల్యే కడియం ఎంపీ ఎన్నికల్లో కావ్య తరఫున సహకరించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీటీసీ సుధాకర్, రంజిత్‌రెడ్డి, రవీందర్, బాలరాజు, రాజు తదితరులు ఉన్నారు.

సమస్య పరిష్కారానికి కృషి

జఫర్‌గఢ్: గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కడియం శ్రీహరి పేర్కొన్నారు. మండలంలోని కూనూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు గురువారం హనుమకొండలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రామంలో నెలకొన్న సమస్యలపై ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యేతో చర్చించారు.